జై భజరంగ భళి

- భక్తులకు కొండంత అండ ఆంజనేయుడు
- నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు

ఆంజనేయుడంటే భక్తులకు కొండంత అండ. రెట్టించిన ధైర్యం. హనుమంతుడి గుండెల్లో శ్రీరామచంద్రుడు కొలువై ఉన్నట్టుగానే.. భక్తుల హృదయాల్లో భజరంగ భళి స్థానం పొందాడు. నాడు మహాభారత కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడి రథంపై 'జెండాపై కపిరాజులా' ఉంటూ విజయ తీరాలకు చేర్చిన హనుమంతుడు.. నేడు ప్రతి ఊరిలో వెలిసి భక్తుల పాలిట ఆపద్బాంధవుడిలా పూజలందుకుంటున్నాడు. ఈ నెల 14న హనుమజ్జయంతిని పురస్కరించుకుని నగరంలో వెలసిన హనుమంతుని భారీ విగ్రహాల్లో కొన్నింటి విశిష్టత తెలుసుకుందాం.

– విశాఖపట్నం డెస్క్

శ్రీ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 27 అడుగులు
ప్రాంతం: మెయిన్ రోడ్డు, పూర్ణామార్కెట్
నిర్మాణ కర్తలు: దేవాలయ నిధులు, దాతలు
విగ్రహావిష్కరణ: 2006లో నాటి ఎమ్మెల్యే దివంగత ద్రోణంరాజు శ్రీనివాస్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ప్రాంతంలో ఆంజనేయ స్వామి స్వయంగా వెలిశాడని ప్రతీతి. భక్తుల పాలిట కల్పతరువుగా స్వామి పూజలందుకుంటున్నాడు.

సంజీవ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 30 అడుగులు, (గ్రౌండ్ లెవెల్ నుంచి 40 అడుగులు)
ప్రాంతం: హనుమంతవాక జంక్షన్
నిర్మాణ కర్తలు: జీవీఎంసీ
ప్రాముఖ్యత: విశాఖలో హనుమంతవాకకు ఎంతో ప్రత్యేకత, విశేష చరిత్ర ఉంది. నగరానికే తలమానికమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం కైలాసగిరి.. ఇక్కడి కొండ మీదే ఉంది. ఈ ప్రాంతానికి గుర్తింపుగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచనల మేరకు జీవీఎంసీ ఈ విగ్రహాన్ని నిర్మిస్తోంది.
ప్రారంభం ఎప్పుడంటే..?: ఈ విగ్రహం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు నెలల్లో పెయింటింగ్‌తో సహా మొత్తం పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించనున్నారు.

అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 16 అడుగులు(గ్రౌండ్ లెవెల్ నుంచి 21 అడుగులు)
ప్రాంతం: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్
నిర్మాణ కర్తలు: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్ వర్తక సంఘం సభ్యులు
విగ్రహావిష్కరణ: 1990లో విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: లారీ స్టాండ్ డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు వర్తక, వ్యాపారాల నిమిత్తం రాకపోకలు సాగించేటప్పుడు అభయాంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేసి బయలుదేరుతారు. తిరుగు ప్రయాణంలో వచ్చిన తర్వాత మళ్లీ ఆంజనేయ స్వామిని కొలుస్తారు. ప్రస్తుతం ఈ లారీ స్టాండ్‌ను షీలానగర్‌కు మార్చారు.

జింక్ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 45 అడుగులు
ప్రాంతం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జింక్ స్థలంలో..
నిర్మాణ కర్తలు: దేవదాయ శాఖ
విగ్రహావిష్కరణ: ఈ విగ్రహాన్ని 2006లో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి తండ్రి తిప్పల దయాల్‌రెడ్డి ఆవిష్కరించారు
ప్రాముఖ్యత : పారిశ్రామిక ప్రాంతంలో ఇదే ఎత్తయిన హనుమంతుడి విగ్రహం. గాజువాక ఆర్టీసీ డిపో ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి ముందు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగేవని.. ఆలయాన్ని నిర్మించి ప్రారంభించిన అనంతరం ప్రమాదాలు తగ్గాయని భక్తులు చెబుతున్నారు.

అభయ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 108 అడుగులు
ప్రాంతం: సీతమ్మధార కొండవాలు
నిర్మాణ కర్తలు: శ్రీ హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి సత్యనారాయణరాజు (ఎ.ఎస్.ఎన్.రాజు), దాతలు
విగ్రహావిష్కరణ: 2021 డిసెంబర్ 8న పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూప నందేంద్ర సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలోని సువిశాల సుందర ప్రదేశంలో నిర్మించిన 108 అడుగుల ఈ భారీ ఆంజనేయ విగ్రహం విశాఖలోనే అత్యంత పెద్దది.. ఎత్తయినది. ఆధ్యాత్మికంగా నగరానికి వన్నెతెచ్చింది.

మాతాభయ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 28 అడుగులు
ప్రాంతం: ఓల్డ్ డైరీ ఫారం జంక్షన్
నిర్మాణ కర్తలు: మాతాభయ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ పెద్ద, ధర్మకర్త బోను సత్యనారాయణ
విగ్రహావిష్కరణ: 2006లో ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: జాతీయ రహదారిపై పాత డైరీ ఫారం జంక్షన్‌లో వెలసిన మాతాభయ ఆంజనేయుడు భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నాడు. విగ్రహ నిర్మాణంతో ఈ ప్రాంతానికి ఎంతో గుర్తింపు వచ్చింది. ఇక్కడి స్వామిని కనులారా దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. చక్కని వాతావరణంలో ఆధ్యాత్మికతతో ఈ ప్రాంతం నిండి ఉంటుంది.

సుందర అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 46 అడుగులు(గ్రౌండ్ లెవెల్ నుంచి 57 అడుగులు)
ప్రాంతం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి
నిర్మాణ కర్తలు: ఆలయ కమిటీ సభ్యులు
విగ్రహావిష్కరణ: 1996 మార్చి 7న నాటి మాజీ ఎమ్మెల్యే, వుడా మాజీ చైర్మన్ దివంగత టి.సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సుందర అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ నిర్మాణాన్ని 1991లో పెద్దాపురం ప్రాంతానికి చెందిన పిండి కృష్ణ అనే శిల్పి ప్రారంభించారు. మరుసటి ఏడాది ఆయన మరణించడంతో ఆ బాధ్యతను ఆయన అల్లుడు రాజ్‌కుమార్ తీసుకుని భారీ విగ్రహం, ఆలయ నిర్మాణాలను పూర్తి చేశారు. నాడు నిర్మానుష్యంగా ఉండే తాటిచెట్లపాలెం ప్రాంతంలో ఆధ్యాత్మికంగా వెలుగొందేలా.. ఓ ల్యాండ్ మార్క్‌లా నిలిచేలా ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఎందరో భక్తులు ఇక్కడికి తరలివచ్చి అంజన్నను తిలకించి తరిస్తుంటారు.

క్లుప్తంగా

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



విద్యార్థులతో అవగాహన కల్పిస్తున్న రజాక్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు విద్యార్థులు మానసిక ధృడత్వం ఎలా ఉండాలి తెలియజేయడంతో పాటు వస్త్రధారణ, ఎదుట వ్యక్తులతో మెలగాల్సిన తీరును వివరించారు. దీంతో పాటు శనివారం మెడిటేషన్‌పై శిక్షణ అందించారు. విజ్ఞానాన్ని, జ్ఞాపకశక్తి పెంచుకోవడంలో మెడిటేషన్ ఉపయోగాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులు గణితంలో మెలుకువలు గణిత నిపుణుడు సంతోష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాక్షీ ప్రతాప్‌కు పురస్కారం



మలేషియా ప్రభుత్వ ప్రతినిధుల సమక్షంలో పురస్కారం అందుకుంటున్న ప్రతాప్

మద్దిలపాలెం : సాంస్కృతిక స్వచ్ఛంద సేవ సంస్థ యాక్షీ వ్యవస్థాపకుడు ప్రతాప్ కుమార్‌కు మలేషియా ఐటీసీ గ్లోబల్ కమ్యూనిటీ ఆర్‌అండ్‌ఆర్‌టీం సంయుక్తంగా శుక్రవారం రాత్రి కౌలాలంపూర్‌లో నిర్వహించిన ఆసియా మీట్‌లో ఔవుట్ స్టాండింగ్ ఈవెంట్ మేనేజర్ 2013 పురస్కారంతో సత్కరించారు. దీనికి సంబంధించి ప్రతాప్ తెలిపిన వివరిలావున్నాయి. సుమారు 300 దేశాల ప్రతినిధులు సమక్షంలో జరిగిన ఆసియా మీట్‌లో జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో తనను గుర్తించి సత్కరించారని తెలిపారు.

ఘనంగా సహస్రచండీ పారాయణం



సహస్రచండీ పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

బీచ్‌రోడ్డు: లోక కల్యాణార్థం అమృతానంద నాథ సరస్వతి దివ్య ఆశీసులతో, శ్రీవేణి మాత పర్యవేక్షణలో సహస్రచండీ పారాయణ, హోమం ఘనంగా నిర్వహించారు. శనివారం ఆర్కేబీచ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన 1,200 మంది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు సహస్రచండీ పారాయణాన్ని శ్రీవేణి మాత చేపట్టారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు వేద పండితులతో చండీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొన్న భక్తులకు ఉచితంగా హోమం సమాగ్రీని నిర్వహకులు పంపిణీ చేశారు.

దాహం తీరుస్తున్న చలివేంద్రాలు



ఏయూక్యాంపస్: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో నగరంలో వివిధ ప్రాంతాలలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ప్రజల దాహాన్ని తీరుస్తున్నాయి. జోన్ 3 పరిధిలోని శివాజీ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజల దాహార్తిని తీరుస్తోంది. మట్టి పాత్రలలో చల్లని నీరు పాదచారులు తాగడానికి ఆసక్తి చూపుతున్నారు.

వెంకన్నకు తోమాల సేవ

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై శనివారం వేంకటేశ్వరస్వామికి తోమాల సేవ విశేషంగా నిర్వహించారు. అర్చన, ఆరాధన, రాజభోగం వంటి పూజాదికాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ కార్యక్రమాలను నిర్వహించారు.

డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాల సందర్శన

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శనివారం ఆరిలోవ, పెందుర్తి ప్రాంతాల్లోని డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాలు సందర్శించారు. శిక్షణ సమయంలో వారికి కావల్సిన మౌలిక వసతులతో పాటు భోజనం, తదితర వసతులపై కమిషనర్ ఆరా తీశారు. మహిళలు ఉత్తమ శిక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శిక్షణ పొందుతున్న ఏఎస్‌ఎంలకు సూచించారు. శిక్షణలో ప్రావీణ్యం పొంది ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

హనుమ జయంతికి ఏర్పాట్లు

ఆరిలోవ: హనుమ జయంతికి ఆరిలోవలో ఆంజనేయ స్వామి ఆలయాలు సిద్ధమయ్యాయి. ఆదివారం జరగనున్న హనుమాన్ జయంతి కోసం ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారిని ఆనుకొని డెయిరీఫారం కూడలి వద్ద ఆంజనేయ స్వామి విగ్రహం, బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని చినగదిలిలో ఆంజనేయ స్వామి విగ్రహాలు సుమారు 20 అడుగులు ఎత్తులో ఉన్నాయి. ఆయా విగ్రహాలతో పాటు హనుమంతవాక వద్ద పోలీస్ అవుట్ పోస్టు పక్కన ఆంజనేయ స్వామి ఆలయం, శ్రీకాంత్‌నగర్‌లో ఆంజనేయ స్వామి ఆలయం, చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయం ఆవరణం, భరత్‌నగర్‌లో వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణంలో ఆంజనేయ స్వామి ఆలయాలున్నాయి. ఈ ఆలయాల్లో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



పూజలకు సిద్ధమైన డెయిరీఫారం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహం

ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటర్ పరీక్షలకు రెమిడీయల్ తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత్ తెలిపారు. లయిన్స్‌క్లబ్ సహకారంతో ఈనెల 22వ తేదీ వరకూ నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులందరికీ భోజనం అందిస్తున్నారన్నారు. ఈమేరకు లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు సన్యాసి నాయుడు, ఆర్.పి.నాయుడు, విమల, పుష్పలత, ఇందిరలతోపాటు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు చెరుకూరి శ్రీరామమూర్తి, చక్కా చందనలు పాల్గొన్నారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

హెల్త్‌సిటీలో పేరుకుపోతున్న వ్యర్థాలు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం హెల్త్ సిటీలో అపారిశుధ్యం తాండవిస్తోంది. ఇక్కడ విశాలమైన రోడ్లు ఉన్నాయి. ఇరుపక్కలా పెద్ద ఆస్పత్రులున్నాయి. అవన్నీ కార్పొరేట్ ఆస్పత్రులే. అయితే కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, రోడ్ల పక్కన పిచ్చి మొక్కలు ఎక్కడబడితే అక్కడ పేరుకుపోయాయి. ఈఎన్‌టీ ఆస్పత్రి, పినాకిల్ ఆస్పత్రి, క్యూ 1 ఆస్పత్రుల మధ్య రోడ్డుకు ఇరుపక్కలా కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి.ఆ స్పత్రులకు వెళ్లే కొందరు రోగులు, వారి బంధువులు ఆయా షాపుల వద్ద టీ, వాటర్ ప్యాకెట్లు కొని వాటిని తాగుతున్నారు. ఖాళీ టీ కప్పులు, వాటర్ ప్యాకెట్లు కాలువల్లో వేసేస్తున్నారు. షాపులు నిర్వాహకులు కూడా వాటిని పట్టించుకోవడంలేదు. శానిటరీ సిబ్బంది అటువైపు వెళ్లడంలేదు. దీంతో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా శానిటరీ అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని, కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కాలువలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

నేటి నుంచి బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవార్లను పలువురు ప్రముఖులు దర్శించుకోనున్నారు.

బంగారమ్మ పండగ..

పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం పండగ చాటింపు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగలవార ప్రధాన పండగ జరుగుతాయి. పితానిదిబ్బ, గొల్లలపాలెం, ప్రకాశరావుపేట, దిబ్బలపాలెం, భానోజీనగర్, కన్నయ్యపేట, విశ్వనాథం రోడ్డు, సింగ్‌హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించనున్నారు.

పోలమాంబ పండగ..

గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం పోలమాంబ పండగ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం చాటింపు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపు కార్యక్రమం జరపనున్నారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్, నెహ్రూనగర్, ఆదిఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాల వాసుల అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించనున్నారు. ప్రధాన పండగ మంగళవారం రోజున పోలమాంబ సదునుపట్టు(ఆర్టీ క్లబ్ గొల్లల పాలెం) నుంచి అమ్మవారిని దూపదీప నైవేద్యాలు, బాజాభజంత్రీలతో తప్పెటగుళ్లు, చెక్కభజన, పులి వేషాలు, సాముగరిడీలతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. 23న మారువారం పండగ జరపనున్నారు. వచ్చే నెల 4న ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ



గొల్లలపాలెం గ్రామ దేవత పోలమాంబ

విరబూసిన మే ఫ్లవర్



కనువిందు చేసిన మే పుష్పం

ఏయూక్యాంపస్ : ఎర్రని పుష్పాలతో ఏడాదిలో ఒక్కసారి మాత్రమే విరబూసే మే ఫ్లవర్లు కనువిందు చేస్తున్నాయి. పెదవాల్తేరులోని రాణిచంద్రమణి దేవి ఆస్పత్రిలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనంలో మే ఫ్లవర్లు విరబూసాయి. పార్క్‌ను సందర్శించే విద్యార్థులకు ఇవి ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేసిన వైనం

సాక్షి ఎఫెక్ట్..

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో ప్రమాదకరంగా మారిన మ్యాన్ హోల్‌ను మరమ్మతులు చేశారు. గోతులో ఉన్న మ్యాన్‌హోల్ పై కప్పు ఎత్తు పెంచారు. సాక్షి దిన పత్రికలో ఇటీవల ప్రమాదకరంగా మ్యాన్ హోల్ శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించిన జీవీఎంసీ యూజీడీ సిబ్బంది హుటాహుటిన మరమ్మతులు చేశారు. ఈ సమస్య పత్రిక దృష్టికి తీసుకువచ్చిన ఇసుకతోటకు కె.రామారావు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

కామెడీ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీకాలనీ : వేసవి సెలవుల నేపథ్యంలో బాలలకు ఆటవిడుపుగా కామెడీ అంశంపై ఉచిత శిక్షణ అందించనున్నట్లు బాల వికాస్ పౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు వెల్లడించారు. దీనికి సంబంధించిన గోడపత్రికను శనివారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు ఆట విడుపుగా ఇతర యాక్టివీటిల్లోను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు ఈ ఉచిత శిక్షణ కొనసాగుతుందన్నారు. 14 నుంచి 20 ఏళ్ల మధ్య బాలలు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 92905 73289 నంబర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు తదితరులు

గ్రామాల్లో డిజిటల్ విద్యకు ప్రోత్సాహం

బీచ్‌రోడ్డు: గ్రామాల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో వివిధ రాష్ట్రంలోని పలు ప్రభుత్వ స్కూల్స్‌కు కంప్యూటర్స్‌ను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎలక్ట్రోస్టీల్ ప్రతినిధి సురేష్ తెలిపా రు. సీఎస్‌ఆర్‌లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను శనివారం ఆయన మీడియాకు వివరించా రు. అందులో భాగంగా డిజిటల్ విద్యపై దృష్టిపెట్టినట్టు తెలిపారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ప్రసాద విక్రయసాల, కేశఖండనశాల, దర్శనం క్యూలు కిక్కిరిశాయి. మధ్యాహ్నం రాజభోగం సమయంలో భక్తుల క్యూలు బారులు తీరాయి. దేవస్థానం బస్సులు, ఆర్టీసీ బస్సులురద్దీగా మారాయి.